క్లుప్తంగా

సీవోఈలో బీబ్రా విద్యార్థినికి సీటు


విద్యార్థినిని అభినందిస్తున్న సిబ్బంది

దహెగాం: మండలంలోని బీబ్రా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రత్నం అశ్విని సీవోఈ (కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్), ఆదిలాబాద్‌లో సీటు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి తెలిపారు. ఇటీవల నిర్వహించిన సీవోఈ ఎంట్రెన్స్‌లో ప్రతిభ కనబర్చి సీటు పొందినట్లు పేర్కొన్నారు. పది ఫలితాల్లో సైతం పాఠశాల నుంచి 8.2 జీపీఏ సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజు ఉన్నారు.

సెల్‌ఫోన్ రికవరీ చేసిన పోలీసులు


బాధితుడికి ఫోన్ అందజేస్తున్న పోలీసులు

సిర్పూర్(టి): మండల కేంద్రానికి చెందిన బత్తుల చంద్రశేఖర్ అనే వ్యక్తి గతంలో తన ఫోన్ పోగొట్టుకోగా సిర్పూర్(టి) పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు ఐఎంఈఐ నంబర్‌తో మొబైల్ ఫోన్‌ను గుర్తించారు. రికవరీ చేసిన ఫోన్‌ను బత్తుల చంద్రశేఖర్‌కు అప్పగించారు.

సీఎం కప్ పోటీలు విజయవంతం చేయాలి

కౌటాల: మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో ఈ నెల 15వ తేదీ నుంచి సీఎం కప్ మండల స్థాయి క్రీడలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ తెలిపారు. బుధవారం స్థానిక మినీ స్టేడియంలో క్రీడాపోటీల నిర్వహణ కోసం అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు. వివరాలకు ఎంఎల్ రాజు 9490822980, మార్త రమేశ్ 9908903954లను సంప్రదించాలన్నారు. ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, తహసీల్దార్ సాయన్న, ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఎంపీవో మౌనిక, ఉప సర్పంచ్ తిరుపతి, కార్యదర్శి సాయికృష్ణ, ఉపాధ్యాయులు రమేశ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో ఈనెల 15, 16, 17వ తేదీల్లో నిర్వహించే సీఎం కప్‌లో పాల్గొనే క్రీడాకారులు పేర్లను నమోదు చేసుకోవాలని ఎంపీడీవో గంగాసింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ పోటీలను మండల స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు మండల పరిషత్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

బాధితులకు ఆర్థిక సాయం

కౌటాల: అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన మండలంలోని ముత్తంపేట గ్రామానికి చెందిన బెండారే నాందేవ్, బెండారే వాగు కుటుంబాలకు బుధవారం హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. కౌటాల హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ గ్రామీణ వితరక్ దుర్గం జానకిరావ్, సిర్పూర్(టి) హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వితరక్ ఖుర్షీద్ అహ్మద్ రెండు కుటుంబాలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. శీర్షా గ్రామానికి చెందిన ఎగ్గే బీరయ్యకు 25 కిలోల బియ్యం అందించారు. సర్పంచ్ ఆదే శ్రీనివాస్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆదే వసంత్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాగేశ్వర్ రావు

ఆసిఫాబాద్: మండలంలోని సాలెగూడ గ్రామ పంచాయతీలో వాల్మీకి(బెస్త) సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు ఎండీ ముషీరొద్దిన్, గ్రామస్తులు భీమ్‌రావు, గోమస్, తదితరులు ఉన్నారు.

కమిటీల ఏర్పాటు అభినందనీయం

కాగజ్‌నగర్‌టౌన్: ప్రతీ పోలీసుస్టేషన్‌లో సీనియర్ సిటిజన్స్ రక్షణ, పోషణ, పరిరక్షణ కోసం స్వచ్ఛంద కమిటీ ఏర్పాటుకు పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడం అభినందనీయమని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ బుధవారం అన్నారు. కమిటీలను ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

‘పది’ ఫలితాల్లో రెబ్బెన విద్యార్థుల హవా

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో రెబ్బెన మండలానికి చెందిన విద్యార్థులు 88శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వెంకటేశ్వర స్వామి తెలిపారు. మండలంలో 470 మంది విద్యార్థులకు 457 మంది పరీక్షలకు హాజరు కాగా 394 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలో బాలికలదే హవా కొనసాగింది. తుంగెడ జెడ్పీ హైస్కూల్‌లో 93.33 శాతం, కేజీబీవీ 80.95 శాతం, గంగాపూర్ జెడ్పీ హైస్కూల్ 81.54 శాతం, తక్కళ్లపల్లి హైస్కూల్ 35.71 శాతం, నంబాల హైస్కూల్ 81.58 శాతం, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ (బాలికలు) 100 శాతం, రెబ్బెన హైస్కూల్ 79.38 శాతం, ఐటీడీఏ ఆశ్రమ హైస్కూల్ 57.14 శాతం, సింగరేణి ఉన్నత పాఠశాల 86.96, నవేగాం హైస్కూల్ 83.33 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల టాపర్లుగా టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ విద్యార్థులు

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి టాపర్లుగా మండల కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ (బాలికలు) పాఠశాల విద్యార్థులు నిలిచారు. పాఠశాలకు చెందిన దుర్గం వైశాలి, ఎస్. మహాలక్ష్మి, సీహెచ్.రాణి 9.5 జీపీఏ సాధించి మండల టాపర్లుగా నిలిచారు. పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు.


వైశాలి


మహాలక్ష్మి


రాణి

క్రిష్ణవేణి విద్యార్థుల ప్రతిభ


పి. సాయి రక్షిత్


జి. వినయ్ సాయి


ఎం. శ్రీహర్షిత


డి.సుజిత


వి.నిత్యశ్రీ


కె.సాయికృష్ణ

కాగజ్‌నగర్‌టౌన్: పదో తరగతి ఫలితాల్లో క్రిష్ణవేణి టాలెంట్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మొత్తం 66 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా పెద్దింటి సాయి రక్షిత్ 10 జీపీఏ సాధించారు. వినయ్ సాయి, శ్రీహర్షిత, సుజిత, నిత్యశ్రీ, సాయికృష్ణ 9.8 జీపీఏ సాధించారు. ఇద్దరు విద్యార్థులకు 9.7, ముగ్గురికి 9.5, 18 మంది విద్యార్థులు 9 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ సురవర్ధన, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

దహెగాంలో తగ్గిన ఉత్తీర్ణత


అక్షయ


స్పందన


నిఖిల్

దహెగాం: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో మండలంలోని విద్యార్థులు 72శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో మొత్తంగా 260 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 187 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. చినరాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కేర్‌కర్ అక్షయ 9.2 జీపీఏతో మండల టాపర్‌గా నిలిచింది. స్థానిక కేజీబీవీకి చెందిన తెలిగె స్పందన 8.5 జీపీఏ సాధించి రెండో స్థానంలో నిలిచింది. చినరాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 35 మందికి 27 మంది, ఇట్యాలలో 40 మందికి 29 మంది, బీబ్రాలో 24 మందికి 10 మంది, కుంచవెల్లిలో 36 మందికి 27 మంది, దహెగాం కేజీబీవీలో 33 మందికి 19 మంది, కల్వాడ ఆశ్రమ పాఠశాలలో 18 మందికి 11 మంది, దహెగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 46 మందికి 32 మంది ఉత్తీర్ణత సాధించారు. మండల కేంద్రంలోని సెయింట్ ఫ్రాన్సిస్ ప్రైవేటు పాఠశాలలో మానెం నిఖిల్ 9.2 జీపీఏ సాధించాడు. కాగా గత సంవత్సరంతో పోల్చితే ఉత్తీర్ణత శాతం తగ్గింది. గత సంవత్సరం 73శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.

పెంచికల్‌పేట్‌లో 56శాతం ఉత్తీర్ణత

పెంచికల్‌పేట్: పదో తరగతి ఫలితాల్లో మండలంలో 56శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 170 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 96 మంది ఉత్తీర్ణత సాధించారు. పెంచికల్‌పేట్ కేజీబీవీలో 41 మందికి 31 మంది, జెడ్పీఎస్‌ఎస్ పెంచికల్‌పేట్‌లో 56 మందికి 31 మంది, జెడ్పీఎస్‌ఎస్ చేడ్వాయిలో 35 మందికి 16 మంది, ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో 22 మందికి 11 మంది, కమ్మర్‌గాం ఆశ్రమ పాఠశాలలో 16 మందికి ఏడుగురు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఐదుగురు విద్యార్థులు 8.3 జీపీఏ సాధించారు.

తిర్యాణి టాపర్‌గా పెట్టం అశ్విత


పెట్టం అశ్విత

తిర్యాణి: మండలంలోని పంగిడి మాదార ఆశ్రమ పాఠశాలలో 86.67 శాతం, గిన్నెధరి ఆశ్రమ పాఠశాలలో 85.71 శాతం, గురుకుల పాఠశాలలో 94.29 శాతం, తిర్యాణి ఆశ్రమ పాఠశాలలో 91.89 శాతం, జెడ్పీ పాఠశాలలో 90.91 శాతం, రోంపల్లి ఆశ్రమ పాఠశాలలో 100 శాతం, మాణిక్యాపూర్ ఆశ్రమ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. నాయకపుగూడ గ్రామానికి చెందిన పెట్టం అశ్విత 9.3 జీపీఏను సాధించి మండల టాపర్‌గా నిలిచింది. మండల టాపర్‌గా నిలిచిన పెట్టం అశ్వితను జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సెడ్మకి రాము అభినందించారు.

సత్తా చాటిన గురుకుల విద్యార్థులు


సాయికుమార్

సిర్పూర్(టి): పదో తరగతి ఫలితాల్లో మండలంలోని గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల 93శాతం, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, సిర్పూర్(టి) 93.5 శాతం, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల (కాగజ్‌నగర్) 93 శాతం, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల 83శాతం, ఈడెన్ గార్డెన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల 78శాతం, గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల 66.6 శాతం, గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల 55 శాతం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సిర్పూర్(టి) 51శాతం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వేంపల్లి 40శాతం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లోనవెల్లి 35శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని ఉన్నత పాఠశాలల్లో గురుకుల పాఠశాల విద్యార్థులే అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలం టాపర్‌గా స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన సీహెచ్. సాయికుమార్ 9.7 జీపీఏ సాధించి టాపర్‌గా నిలిచాడు.

కెరమెరిలో 43.23 శాతం ఉత్తీర్ణత


కె.రుక్మాబాయి

కెరమెరి: పదో తరగతి ఫలితాల్లో కెరమెరిలో 43.23 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 340 మంది విద్యార్థులకు 147 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. కెరమెరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 38 మంది ఉత్తీర్ణత సాధించగా 63.33 ఉత్తీర్ణత శాతం నమోదైంది. గోయగాంలో 32 మందికి 11 మంది (34 శాతం), ఝరిలో 22 మందికి 8మంది (36శాతం), కేజీబీవీలో 34 మందికి 21 మంది(61.76 శాతం), మోడిలో 96 మందికి 20మంది (21శాతం), హట్టిలో 42 మందికి 21 మంది (50 శాతం), అనార్‌పల్లిలో 34 మందికి 19 మంది (56 శాతం), రాంజీగూడలో 20 మందికి 9 మంది (45 శాతం) ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీకి చెందిన కె. రుక్మాబాయి 9 జీపీఏతో మండల టాపర్‌గా నిలిచారు.

ప్రతిభ కనబర్చిన బెజ్జూర్ విద్యార్థులు

బెజ్జూర్: మండలంలోని పదో తరగతి విద్యార్థులు ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. బెజ్జూర్ ఆశ్రమ పాఠశాల, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. బెజ్జూర్ ఆశ్రమ పాఠశాలలో 30 మంది విద్యార్థులకు 27 మంది, సోమిని ఆశ్రమ పాఠశాలలో 23 మంది విద్యార్థులకు 19 మంది, కుంటలమానెపల్లి ఆశ్రమ బాలికల పాఠశాలలో 27 మంది విద్యార్థులకు 18 మంది, సలుగుపల్లి ఆశ్రమ పాఠశాలలో 29 మంది విద్యార్థులకు 21 మంది, బెజ్జూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 85 మంది విద్యార్థులకు 59 మంది, సలుగుపెల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 40 మంది విద్యార్థులకు 30 మంది, బెజ్జూర్ కేజీబీవీలో 37 మంది విద్యార్థులకు 21 మంది ఉత్తీర్ణులయ్యారు. బెజ్జూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలోని ఆడే గణేష్, సిడం మహారాణి, ప్రవీణ్‌లు 8.3 జీపీఏ సాధించారు.

కౌటాల విద్యార్థుల ప్రభంజనం


వినయ్‌చంద్ర


ఎల్ములే కునాల్

కౌటాల: పదో తరగతి వార్షిక ఫలితాల్లో కౌటాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. బోదంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10 మంది విద్యార్థులకు 5గురు, కౌటాల ఉన్నత పాఠశాలలో 104 విద్యార్థులకు 57 మంది, ముత్తంపేట జెడ్పీ పాఠశాలలో 26 మంది విద్యార్థులకు 18 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గుండాయిపేట్ ఉన్నత పాఠశాలలో 26 మంది విద్యార్థులకు 12 మంది విద్యార్థులు, కస్తూరిబా గాంధీ పాఠశాలలో 31 మంది విద్యార్థులకు 21 మంది విద్యార్థులు, మొగడ్‌దగడ్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో 36 మంది విద్యార్థులకు 20 మంది పాసయ్యారు. మండల కేంద్రంలోని మయూరి ప్రైవేట్ పాఠశాల విద్యార్థి బండి వినయ్ చంద్ర 9.8 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. గుండాయిపేట్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎల్ములే కునాల్ 8.5 జీపీఏ పాయింట్లు సాధించారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల విజయకేతనం


అశోక్


హరిణి


సాయి ప్రణయ్


సుప్రియ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు 90శాతం ఉత్తీర్ణత సాధించారు. 9.8 జీపీఏతో తెహ్రీమ్ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. హరిణి 9.5, శైలజ 9.3, సాయి ప్రణయ్ 9.3 సాధించారు. 9మంది విద్యార్థులు 9 జీపీఏ సాధించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 73 మందికి 71 మంది పాస్ కాగా అశోక్ 9.8 జీపీఏ సాధించారు. బూర్గుడలో 73 మంది విద్యార్థులకు 51 మంది, బాలురు ఉన్నత పాఠశాల (ఆసిఫాబాద్)లో 72 మంది విద్యార్థులకు 40 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 107 మంది బాలికలకు 74 మంది ఉత్తీర్ణులయ్యారు. గిరిజన గురుకుల పాఠశాలలో పీటీజీ బాలురలో 42 మందికి 29 మంది, ఉర్దూ మీడియం (ఆసిఫాబాద్)లో 23 మంది విద్యార్థులకు 11 మంది, కేజీబీవీ (ఆసిఫాబాద్)లో 42 మంది విద్యార్థులకు 32 మంది ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీలో సుప్రియా 9.2 జీపీఏతో జిల్లాలోని కేజీబీవీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. బీసీ బాలికల గురుకుల పాఠశాలలో 56 మంది విద్యార్థులకు 48 మంది, మైనార్టీ బాలికల గురుకులంలో 64 మందికి 57 మంది విద్యార్థులు, బీసీ బాలుర గురుకులంలో 78 మందికి 75 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

మండల టాపర్‌గా అల్లి వందన


అల్లి వందన

కాగజ్‌నగర్‌రూరల్: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల టాపర్‌గా అల్లి వందన నిలిచింది. పట్టణంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల (బాలికల)కు చెందిన అల్లి వందన 9.2 జీపీఏ సాధించింది. జెడ్పీఎస్‌ఎస్ (బాలికల) పాఠశాలలో 28 మంది విద్యార్థులకు 24 మంది, ఆరెగూడ పాఠశాలలో 25 మందికి 19, కాగజ్‌నగర్ కేజీబీవీ పాఠశాలలో 39 మందికి 37, భట్‌పల్లి పాఠశాలలో 48 మందికి 31, జెడ్పీ బాయ్స్ హైస్కూల్ సర్‌సిల్క్‌లో 53 మందికి 15, రాస్పెల్లి పాఠశాలలో 36 మందికి 29 మంది, జెడ్పీ గర్ల్స్ సర్‌సిల్క్‌లో 28 మందికి 24 మంది, కాగజ్‌నగర్ ప్రభుత్వ హైస్కూల్‌లో 19 మందికి 12 మంది, చింతగూడ (కె) పాఠశాలలో 40 మందికి 22 మంది, జెడ్పీ గజ్జిగూడ పాఠశాలలో 10 మందికి 9 మంది, ఈజ్‌గాం నెం.5 పాఠశాలలో 72 మందికి 49 మంది, పెట్రోల్‌పంపు పాఠశాలలో 36 మందికి 24, ఈజ్‌గాం నెం.3 పాఠశాలలో 49 మందికి 31, గన్నారం పాఠశాలలో 8 మందికి ఐదుగురు, ఆర్‌బీ ఉర్దూ పాఠశాలలో 18 మందికి 10, ప్రభుత్వ పాఠశాల (న్యూ)లో ఎనిమిది మందికి ఏడుగురు ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 489 మంది విద్యార్థులకు 324 మంది విద్యార్థులు (66 శాతం) పాసయ్యారు.

చింతలమానెపల్లి మండలంలో 58.77శాతం


లెండుగురె రాజేశ్వరి


సోమన్‌కార్ స్ఫూర్తి

చింతలమానెపల్లి: మండలంలోని ఆయా పాఠశాలల్లో 10వ తరగతిలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తగ్గింది. బుధవారం విడుదల అయిన ఫలితాల్లో మండల వ్యాప్తంగా మిశ్రమ ఫలితాలు వచ్చాయి. మండలంలోని ఆయా పాఠశాలల నుంచి 228 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వీరిలో 134 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత శాతం 58.77గా ఉంది. మండలంలో అత్యధికంగా రవీంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 25మంది విద్యార్థులకు 24 మంది, చింతలమానెపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 34 మంది విద్యార్థులకు 19మంది, గంగాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఏడుగురు విద్యార్థులకు ఆరుగురు, డబ్బా జెడ్పీహెచ్ఎస్‌లో 21 విద్యార్థులకు 11 మంది, బాబాసాగర్ జెడ్పీహెచ్ఎస్‌లో 35 మంది విద్యార్థులకు 23మంది, కేజీబీవీలో 45 మంది విద్యార్థులకు 30 మంది, బాబాపూర్ ఆశ్రమ పాఠశాలలో 42 మంది విద్యార్థులకు 16 మంది, కేతిని ఆశ్రమ పాఠశాలలో 19 మంది విద్యార్థులకు 5గురు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అత్యల్పంగా కేతిని ఆశ్రమ పాఠశాలలో ఉత్తీర్ణత 26శాతంగా ఉంది. బాబాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని లెండుగురె రాజేశ్వరి 8.5 జీపీఏ, చింతలమానెపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని సోమన్‌కార్ స్ఫూర్తి 8.3 జీపీఏతో టాపర్లుగా నిలిచారు. డబ్బా జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గత ఏడాది 81శాతం ఫలితాలు రాగా ఈఏడాది 52శాతానికి పడిపోయింది. గంగాపూర్ మినహాయిస్తే అన్ని పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం తగ్గింది.

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

కాగజ్‌నగర్‌టౌన్: నియోజకవర్గంలోని ఓటరు జాబితాలో దొర్లిన తప్పులను సవరించేందుకు ప్రతీఒక్కరు సహకరించాలని కాగజ్‌నగర్ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం వివిధ పార్టీల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఓటరు ఆధార్‌కార్డు అనుసంధానం చేసుకోవాలన్నారు. జాబితాలోని తప్పులు, ఓటర్ల నమోదుకు నాయకులు, కార్యకర్తలు సహకారం అందించాలని కోరారు. వీవీ ప్రసాద్, ఆనంద్ కుమార్, అనిల్ కుమార్, ముబీన్, జావిద్, విలాస్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

రెబ్బెన: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్ అన్నారు. మండలంలోని నక్కలగూడలో బుధవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్యలతో కలిసి ప్రారంభించారు. మండలంలోని రైతులందరూ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీటీసీ మదునయ్య, కోఆప్షన్ సభ్యులు జహురొద్దీన్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సుదర్శన్‌గౌడ్, శ్రీధర్, అజయ్ జైస్వాల్, వెంకటేశం చారి, తిరుపతి పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కుమురం మాంతయ్య, ఎంపీపీ డుబ్బుల నానయ్య ప్రారంభించారు. ప్రభుత్వం సాధారణ రకం క్వింటాలు వరి ధాన్యానికి రూ. 2040, ఏగ్రేడ్ రకం వరి ధాన్యానికి రూ. 2060 ధర చెల్లిస్తుందన్నారు. ఏవో రామక్రిష్ణ, ఏఈవోలు విజయ్, హెబ్సిబా, కోఆప్షన్ సభ్యులు నాజిం హుస్సేన్, మండల రైతుబంధు సమితి కోఆర్డినేటర్ భీంకరి నారాయణ, సహకార సంఘం అధికారి రాజు, గోదాం ఇన్‌చార్జి తాజిం హుస్సేన్ పాల్గొన్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్ పరిశీలన


ల్యాబ్‌ను పరిశీలిస్తున్న సురేశ్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను స్కూల్ అకడమిక్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సురేశ్‌బాబు బుధవారం సందర్శించారు. తరగతుల నిర్వహణ, ప్రాజెక్ట్, నిధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్, ల్యాబ్ ఇన్‌చార్జి జాడి దీపక్, ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వర్ రావు ఉన్నారు.

కోచింగ్ సెంటర్ సందర్శన

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని డివిజనల్ రిసోర్స్ సెంటర్‌లో నిర్వహిస్తున్న పాలిసెట్ ఫ్రీ కోచింగ్ సెంటర్‌ను బుధవారం స్కూల్ లీడర్‌షిప్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సురేష్ బాబు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఫ్రీ కోచింగ్ సెంటర్ పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం 9 జీపీఏకు పైగా సాధించిన విద్యార్థులకు ఎస్‌ఎస్‌సీ ఇంటర్నెట్ మెమోలు అందించి అభినందించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ మధుకర్, కోకన్వీనర్, మండల విద్యాశాఖ అధికారి బిక్షపతి, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీశైలం, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు తిరుపతయ్య, రాజ్ కమలాకర్ రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం

కాగజ్‌నగర్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీవోఏలు చేపడుతున్న సమ్మె బుధవారం 24వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా వీవోఏలు సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు వినతిపత్రం అందించేందుకు వెళ్లారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో ఆయన పీఏకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ముంజం ఆనంద్ కుమార్, ఐకేపీ వీవోఏలు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

వాంకిడి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ విమలబాయి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సభ్యుల గైర్హాజరుతో వాయిదా పడింది. ఎన్నో సమస్యలు ఉన్నా సమావేశంలో వాటిని ప్రస్తావించకుండా సభ్యులు గైర్హాజరవడంపై మండలవాసులు మండిపడుతున్నారు. మండలంలో 8 మంది ఎంపీటీసీలు ఉండగా సర్వసభ్య సమావేశానికి ఏ ఒక్క ఎంపీటీసీ కూడా హాజరు కాలేదు. వివిధ శుభకార్యాల నిమిత్తం ఎంపీటీసీలు హాజరు కాలేకపోయారని ఎంపీపీ ముండె విమలబాయి పేర్కొన్నారు. సర్పంచుల గైర్హాజరుపై సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బండె తుకారాం మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మద్దతుగా సర్వసభ్య సమావేశానికి దూరంగా ఉన్నారన్నారు. వారి సమ్మెతో గ్రామాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్యం కుంటుపడిందన్నారు.